



# పర్వీన్

-ఎం.శ్రీలత

**ప**ర్వీన్ బావుంటుంది. చామనచాయ. గుండ్రని మొహం. పద్దెనిమిదేళ్ళ వయసు తెచ్చిన బింకం. పని చెబితే శ్రద్ధగా చేసే తత్వం, చెప్పింది కాకుండా అధిక ప్రసంగానికి పోని వ్యవహారం. అమర్యాద లేని వ్యక్తిత్వం. అందుకే నా 'జర్మినేషన్ ల్యాబ్'లో అసిస్టెంట్‌గా పెట్టుకున్నాను. పైగా ఇంతో అంతో చదువుకుంది కూడా. ఆదాయానికీ ఆలోచనకూ పనికిరాని చదువు. సమస్య వచ్చేంతవరకు నాకూ తెలీలేదు పర్వీన్ జీవితం గురించి ...

**తె**లంగాణాలో పేద ప్రజల జీవన విధానంలో రజాకార్ల ప్రభావం ఇంకా తగ్గలేదనే చెప్పాలి. 'పెద్ద మనిష' య్యాక ఆర్నెల్లకు పిల్ల పెళ్ళి చేయలేని తండ్రిని




చులకనగా చూస్తారు. 'బిడ్డ పెద్దగయినా పెండ్లి జెయ్యడీ నాయాలు! దాని కూలికాశపడి' అనేస్తారు మొహంమ్మీదే! పద్దెనిమిదేళ్ళు. అప్పుడే పెళ్ళేంటి అనే ఆలోచన పెద్ద కుటుంబాల్లో వుంటుంది. ఈ శతాబ్దంలో అదింకా బాల్యదశలోనే వుంది. అదే పెద్ద కుటుంబాల్లో ఓణీలు వేసుకునే ఈడు రాకున్నా పెద్ద మనిషయితే చాలు. పెళ్ళి చేయాల్సిందే! 'ఇంగ జరనయం! మేం చిన్నగున్నప్పుడు తొట్లల్లనే పెండ్లి జేస్తుండ్రి' అని విస్తుపోతారు ముసలమ్మలు. అందుకే పధ్నాలుగేళ్ళకే పెద్ద మనిషయిన పర్వీన్‌కు పద్దెనిమిదేళ్ళొచ్చినా పెళ్ళికాకపోవడం కంపెనీ కూలీల్లో పెద్ద చర్చించుకునే విషయంగా మారిపోయింది.

''గా పిల్లనెవడు జేసుకుంటడమ్మా! తల్లి తెలగామె. తండ్రి తురకాయన'' అన్నాడు బాలయ్యో రోజు... ''పర్వీన్‌కు మంచి అబ్బాయిని చూడు పెళ్ళి చేసేద్దాం'' అని నేనంటే...

వాళ్ళమ్మా నాన్నల కాలంలోనే మతాంతర వివాహం. అందుకే చాలా సంతోషమనిపించింది... వాళ్ళమ్మా నాన్నా కలిసే వున్నారా?'' అనుమానం వచ్చింది నాకు.

''వాళ్ళు బాగానే వున్నారు. ఆయమ్మ సంపాయిస్తది. వాడు సంపాయిస్తడు. ముగ్గురు కొడుకులకు ఎదురొచ్చి పిల్లలనిచ్చిండ్రు. మంచి పోరగాండ్లు కష్టపడతరు. సంపాయించి పెళ్ళానికి గింత పెడ్తరూ. ఆడపిల్ల... దీని బతుకే అడవి పాలయింది. తెలగోళ్ళను చేసుకొమ్మంటే 'ఈ తురకపిల్లనా?' అంటారు. పోనీ ఆళ్ళను జేసుకొమ్మంటే 'దాని తల్లి తెలగామె గదు' అంటరు. అక్కడిక్కడ గాకుండా అడకత్తెర్ల వచ్చి పోకాయే దాని బతుకు'' నిట్టూర్చాడు బాలయ్య. చిన్నప్పట్నించి చూస్తున్నాడయే. ఆ అమ్మాయి మీద కాస్త జాలి.

ooo

పది రోజుల నుంచి పర్వీన్ పన్లోకి రావడం లేదు. ఆ పిల్ల రాకపోతే పనేం ఆగిపోదు. ఎందుకు రాలేదని అడగాల్సిన అవసరమూ లేదు. ఎందుకంటే పని

> **''గా పిల్లనెవడు జేసుకుంటడమ్మా! తల్లి తెలగామె. తండ్రి తురకాయన అన్నాడు బాలయ్యో రోజు...''**

కూడా ఆగలేదు కాబట్టి. ఆ అమ్మాయి కాక పోతే ఇంకొకరు. వాళ్ళ పని ... మా కూలి. ఈ పాలసీ మనుష్యుల నుంచి మనసులను దూరం చేసే పారిశ్రామిక యుగం మరి! అసలెవరు రాకపోయినా మిషన్ గ్రైండింగ్ జరుగుతుంది. పారిశ్రామిక విప్లవం అనుకుంటాం కానీ అది నిజంగా పేదవాళ్ళ బతుకులకు 'తిప్లవం.' పనికీ కూలికి మధ్య గండం ... చేతికీ నోటికి మధ్య 'గుండం.' ఒక్క యంత్రం వల్ల కొన్ని వందల మంది జీవనోపాధి ఆగిపోయే పరిశ్రమల పెట్టుబడుల యుగం. లేబర్ యాక్ట్ ఎందుకు పనికొస్తుంది? కాలు చేయి విరిగితే కాంపెన్సేషన్. ముందా కాలు చేయి కూడదీసుకునే కూటికి మాత్రం కాదు. ఆ యాక్ట్ ఈ యాక్టూ అనేసరికి పెట్టుబడులు మిషన్లెక్కుతాయి. శ్రామికుల వలసలు సాగుతున్నాయి.

ఆ తరువాత ఆర్నెల్లకు గుర్తొచ్చింది ''పర్వీన్‌కు పెళ్ళయిందా?'' అని. పన్లోకి రావడం లేదు అందుకేనేమో! అనుమానం! పాత పిల్ల మానేస్తే పెళ్ళయిందని ... కొత్త పిల్ల పనిలోకొస్తే కాపురాని కొచ్చిందనీ ... ఇది ఫండమెంటల్ రూల్.

''పెళ్ళి కాలేదు కానీ కడుపొచ్చింది'' చెప్పింది లక్ష్మి ఈ పూట వంకాయ కూర అన్నంత మామూలుగా.

''అదెలా?'' కంగారుగా అడిగాను.

''ఎట్లేముందమ్మా! వయసులో వుంది. వయసులున్నోడు నచ్చిండు. కడుపు ఆడదాన్కి వస్తది గన్క దీనికొచ్చింది'' అంది అతి మామూలుగా.

''మరి అందరికీ తెలిసే లోపూ పెళ్ళి చేసేయొద్దూ!''

''చేసుకోడంటమ్మ! వుంచుకుంటడంట! మా కులంగాని దాన్ని ఎట్ల చేసుకోనూ? పొట్ట, బట్ట జరుపుతా! వుంచుకుంట! మంచిగ జూసుకుంట! అంటడు గా పోరగాడు'' చెప్పింది లక్ష్మి.

''వుంచుకునే బదులు నిఖా చేసుకుంటేపోలా! ఇదీ అందర్లో ఒప్పుకోవడమే! అదీ అందర్లో ఒప్పుకోవడమే కదా!''

''అయ్యో! తల్లీ గట్ల గాదు! చేసుకుంటే దాని పిల్లలకు వీడి భూమీ ఆస్తీ ఇయ్యాల. కులం గాని దానికి పుట్టినోళ్ళకు భూమెట్ల పంచుతరు? వుంచుకుంటే దాని కూలి అది తింటది. వీడికిష్టముంటే ఇస్తడు లేకుంటే లేదు. పంచాయతీ గించాయితీ బెట్టినా చెల్లదు మల్ల'' అంటూ పెద్ద లాయర్ లాజిక్ చెప్పేసింది లక్ష్మి.

''అన్యాయం'' గుండె కరిగింది.

''నాయం గీయమని నీలాగ చదూకున్నోళ్ళొచ్చి మయిలా మండలి పెట్టిండ్రంట. అరుణక్క గ్రూపోల్లంట. ఆల్లొచ్చి పెళ్ళి చేసుకోకుంటే మక్కెలిరగదంతం. ఏరే పెండ్లి చేసుకుంటే జైల్ల పెడతం అని బెదిరిచ్చిండ్రంట''

''మంచి పనయింది. లేపోతే మోసం చేద్దామనుకున్నాడా?'' సంతోషపడి పోయాను.

''అయ్యో! మా తల్లీ! ఏం మంచిగయింది. వాళ్ళకు బెదుర్కొని వీడు పరారయిండు. మల్ల మల్ల ఎప్పటికో వస్తడు. ఆడనే దేన్నో చేసుకుంటడు. గీ పోరది ఆడ ఈడ గాకుండా కుండలా కడుపు మోసుకుంటూ తిరుగుతది. రేపు బిడ్డవుతది. దీని తిండి దాని తిండి అదే సంపాయియ్యాల. తినాల. మల్ల మనువు వెవడొస్తడు? ఆడ వుంచుకున్నది గాక పోయే. ఈడ ఊకున్నది గాకపోయే! సదూకున్నోళ్ళ

నాయాలు ఆళ్ళకే పనికొస్తయి. మాకు పనిస్తాయా తిక్కాగాకుంటే! వుంచుకున్నోడున్నా వుంటే వూరి మంది కళ్ళు దాని మీద పడకపోవు గద! గిప్పుడది ఊరి సొమ్మయింది'' తేల్చేసింది లక్ష్మి. ''సర్లే, పర్వీన్‌ను ఓసారి వచ్చెళ్ళమను'' అని వచ్చేశాను.

సాయంత్రానికి పర్వీన్ వచ్చింది భోజనాల య్యాక. ''ఎందుకిలా చేసుకున్నావే?'' అని అడి గాను మామూలుగానే.

''నేనొక్కదాన్నే చేసుకున్నానా అమ్మా ఇద్దరం చేస్తేనే అయింది. వాడు మంచిగా వుంచుకుంటా నన్నడు. మా పెద్దోళ్ళుగా పంచాయతీ గీ పంచాయతీ అని వాడ్ని బెదిరిచ్చి ఎల్లగొట్టిండ్రు. దాంతో వానికి నా మీద మనసిరిగింది'' అని కన్నీళ్ళు పెట్టుకుంది.


''ఉంపుడుగత్తెగా ఉండటం నీకిష్టమేనా?'' అడిగాను.

''ఇష్టం లేకుంటే? నన్నెవడు చేసుకుంటడు? చేసుకున్నా చేసుకోకున్న ఏం పరఖ్ పడ్తది? నేను కూలికి పోయి పైసలు దెచ్చుకుంట బతకతా! నాకో తోడుంటుంటె గదా!'' అంది అమాయకంగా.

రాజీ! బతుకుతో రాజీ! తీరని, తీరవని తెలి సినా ఆశలకు కఠిన జీవన అప్రదిష్ట ప్రమాణాలకు మధ్య కూలిపోయిన ఇష్టాల రాజీ! బతుకు కోసం మనసులు మసి చేసుకునే రాజీ! ఛీత్కారాన్ని, ఊత్కారాన్నీ గౌరవమని, పర్వాలేదని, అంతకంటే దారి లేదని ఒప్పుకుని ఓర్చుకునే రాజీ! అత్యంత అయిష్టాన్ని చిటికెడు నిజంతో రాజీ! తన బతుకు తను బతికినా ముళ్ళ కంపలో పడే బదులు ఒక ముల్లు చీరితే ఏమవుతుందిలే అని గుండెల్ని చీల్చు కునే అరిటాకుల రాజీ! చదువులేని, ఆలోచన లేని అమాయకత్వం. బతుకుతో రాజీ! కేవలం ప్రాణంగా వుండేందుకు రాజీ!

సుఖాన్ని ఊహించని బతుకులు. సుఖాన్ని నిర్వచించలేని బతుకులు. బతుకంటే ఆకలి, బట్ట లు, నిద్ర. అప్పుడప్పుడూ ఓ తోడు అంతే! ఇంతకు మించి బతుకులో ఏముంది? బతకడానికి కొద్దిలో కొద్ది సులువైన దారి అంతే! పుట్టాం కనుక చచ్చే వరకుండాలి కాబట్టి గుడ్డిలో మెల్లగా అవకాశాలతో రోజులు గడవడం. ఆనందానికి దుఃఖానికి తేడా వుండదు. ఆనందం అంటూ వస్తే, దుఃఖం అంటూ పోతే కదా! అందుకే కొన్ని పెదవులు అసలు విచ్చుకోవు. కొన్ని కళ్ళు చెమరించవు... నిర్లిప్తం... అంతే!

ఆలోచనల లోకంలోంచి బయటకొచ్చి ''నీ ఒంట్లో బావుంటుందా?'' అని అడిగాను పొట్ట వైపు చూస్తూ.




''అవన్నీ ఇడిసిపెట్టి నీతోటి ఇదే మాట్లాడా లని వచ్చినామ్మా! కడుపు పోవాలని జిల్లేడు పాలు పట్టిండ్రు. కడుపైతే పోలేదు గానీ ...''

''ఏమైంది?'' మధ్యలోనే అందుకున్నా. ఆడ తనం కంగారు పడి కలకలమయింది నాలో. తను మాట్లాడలేదు. ''ఏమైందీ?'' మళ్ళీ అడిగాను అను నయంగా.

అలా రెండు మూడు సార్లు అడిగాక చూపిం చింది. కడుపులో పేగులు బయటకొచ్చినట్టని పించింది నాకు. కళ్ళు మూసుకుని చాలా సేపు తెరవలేకపోయాను. కాసేపటికి తేరుకుని ''ఎలా తిరుగుతున్నావే? బాధగా లేదూ?'' అని ప్రశ్నిం చాను.

''లేచి రెండు వారాలైందమ్మా! ఉంటే వుంటవు పోతే పోతవు ... బయటకొస్తే ఊకునేది లేదని ఒదినెలు అన్నరు'' అంటూ ఇంకా ఏదో చెబు తూనే ఉంది. నేను వెంటనే మా ఫ్యామిలీ డ్యాక్టర్ ప్రీతికి ఫోన్ చేసి విషయం చెప్పాను. వెంటనే రమ్మంది. తీసుకెళ్ళాను.

టెస్ట్ చేసింది. యుటిరస్‌కు ఇన్‌ఫెక్షన్ సోకింది. వెంటనే అబార్షన్ చేయాలంది. పర్వీన్‌ను అడిగాను ''ఏం చేద్దామని?''

''నాకెవ్వరున్నరమ్మ! నీ ఇష్టమమ్మా!'' అంది. అయినా దానిదెంత వయసని నిర్ణయాలు తీసుకో డానికి. మళ్ళీ తనే అడిగింది.

''ఏమయితది నాకు? ఏమయిన పర్వలే. పిల్లగాడు మంచిగుంటే చాలు'' అంది.

ఎవరివల్ల ఇలా అయింది. ఎవరివల్ల తను మోసపోయిందని కాదు... తనకు తల్లవ్వాలని కోరిక ... ఇష్టం. ఎలాగూ భార్య కాలేదు. అమ్మవుదామనే ఆశ. ఆడతనమా నీకు జోహార్లు! అమ్మతనం కోసం అవసరమైతే జీవితాన్ని, ప్రాణాన్నీ ఇస్తావు.

''ఒక వేళ కూతురు పుడితే'' అన్నాను.

''కూతురైతే వద్దమ్మా! పెద్దయ్యాక చంపే బదులు ఇప్పుడే చంపుండ్రి. అది కూడా నాలాగ గావద్దు!'' అంది ఏడుస్తూ.

త్యాగం... తను పడిన ఘర్షణ బిడ్డ పడకూడ దని త్యాగం. పసి వయసులోనే ముసిమి వయసు వేదాంతం.

''నీ మొహం! ఆడామగా కాదు. ఇప్పుడు అబా ర్షన్ చేయకపోతే ఈ పిల్ల చస్తుంది ముందు'' డ్యాక్టర్ వార్నింగ్ ఇచ్చింది ఇద్దరికీ కఠినంగా. ఆ తరువాత ఏదవసరమో అది సజావుగా జరిగిపోయింది.

ooo

ఇప్పుడు పర్వీన్ పనిలోకొస్తోంది. నాకు బోలె డంత ఆనందంగా ఉంది. తను నాకేమీ కొత్తగనిపిం చడం లేదు. జీవితంలో ఏం జరగని పర్వీన్‌నే. మరి సమాజానికి? అందుబాటులో విందు ... చేయి చాస్తే అందే తాంబూలం ...! ఓడోడి వుంపుడుగత్తె వాడకంతా వదిన...

ఆడపిల్లల బతుకులు పాకుడుబండపై చిను కులు. ఏ నిర్ణయాలకూ అందని బతుకులు. విప్ల వాలు, సంస్కరణలు ఒక తరాన్ని నిలబెడితే మరో తరాన్ని కూలగొడుతున్నాయి. మళ్ళీ విప్లవాలు... విప్లవాలు ... మార్పుకోసం మారణ హోమాలు!